

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్టం : 34.0
కనిష్టం : 20.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:21 (మంగళ)
సహరి : 4:47 (బుధ)

వాటిని వదిలేసి.. వీరికి ముసుగేశారు !



ఎన్నికల షెడ్యూలు వచ్చి 48 గంటలు గడిచినా చాలాచోట్ల రాజకీయ ఫ్లెక్సీలను వదిలేసిన అధికారులు.. అత్యుత్సాహంతో దేశ నాయకుల విగ్రహాలకు ముసుగు లేశారు. పెంటపాడులో మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి ఇలా గుడ్డ కప్పారు. - 7లో..

టెన్త్ పరీక్ష ప్రశాంతం

జిల్లాలో 21,523 మంది హాజరు.. 1,597 మంది గైర్హాజరు

భీమవరం రూరల్, మార్చి 18 : పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం తొమ్మిదిన్నరకు పరీక్ష సమయం కావడంతో విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. తొమ్మిది గంటలకు లోపలకు అనుమతించారు. 127 పరీక్ష కేంద్రాలలో 23,120 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి వుంది. కాని, 21,523 మంది హాజరవగా, 1,597 మంది గైర్హాజరయ్యారు. 93.09 శాతంగా నమోదైంది. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 42 పరీక్ష కేంద్రాలు, డీఈవో వెంకటరమణ ఎనిమిది పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. వీరితోపాటు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ నాలుగు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈవో తెలిపారు.


పెంటపాడు ప్లస్‌టూ స్కూల్‌లో..

సాగు భయం


పెనుగొండ మండలంలో నీరు అందని పొలం

- వాతావరణంలో మార్పులు.. వేల ఎకరాల్లో దాళ్వా వరికి దెబ్బ
- సాగుకు ముడత, అగ్గి తెగులు వస్తాయన్న ఆందోళనలో రైతులు
- రొయ్యలు, చేపలకు ఆక్సిజన్ సమస్య

పెనుగొండ మండలం బ్యాంక్ కెనాల్ నెంబర్-1 కాలువ పరిధిలో దేవ, తామరాడ గ్రామాల్లో పది రోజులుగా వరి పొలాలకు సాగు నీరందక నేల నెర్రలు తీస్తోంది. పొట్ట, ఈనిక దశలో నీరందక పోతే దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువ నిండా తూడు, గుర్రపు డెక్క, పెరిగిపోవడంతో సాగు నీరు వచ్చే పరిస్థితి లేదు. అలాగే యలమంచిలి మండలం కాజ శివారు ప్రాంతాలలో సాగు నీటి సమస్య ఎక్కువగా వుంది. అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

భీమవరం రూరల్/కలిదిండి, మార్చి 18 : వాతావరణ మార్పు దాళ్వా రైతులను భయపెడుతోంది. గడిచిన మూడు రోజులుగా మబ్బులు పట్టడం, ఎండ తీవ్రత తగ్గడం రైతులను భయపడేలా చేసింది. మరోవైపు వర్షాలు రావచ్చన్న హెచ్చరికలు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. జిల్లాలో రెండు లక్షల 23 ఎకరాలలో దాళ్వా సాగు చేశారు. మెట్టలో ఈనిక పూర్తయి పాలు పోసుకునే దశలోను, డెల్టాలో ఈనిక దశ, పొట్ట దశ, మరికొన్ని ప్రాంతాలలో అయితే పిలక తొడిగే దశలో వరి పంట ఉంది. ఈ దశలో చిన్నపాటి వర్షం పడినా మేఘాలతో వాతావరణం ఉన్నా ముడత, అగ్గి తెగులు, మెడ విరుపు తెగులు ప్రధానంగా విజృంభించే అవకాశం ఉంది. ఇవి వస్తే పురుగు మందుల పెట్టుబడి భారం, దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉంది. దీంతో రైతుల్లో వాతావరణ మార్పు ఉండకూడదనే ఆలోచనలోనే ఉన్నారు. అకాల వర్షాలు ఈ సమయంలో రాకూడదని రైతులు కోరుతున్నారు.

ఆక్వా రైతుల ఆందోళన

వాతావరణంలో మార్పులతో చెరువుల్లో ఆక్సిజన్ కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని లక్షలాది ఎకరాల్లో చేపలు, రొయ్యల సాగు చేస్తున్నారు. వేసవిలో రొయ్యల సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండడంతో లక్షలాది రూపాయల పెట్టుబడులతో వనామి రొయ్యల పెంపకం చేపట్టారు. ప్రస్తుతం వాతావరణం చల్లగా ఉండడంతో చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ లోపించి రొయ్యలు చనిపోయే ప్రమాదం ఉండడంతో చెరువుల్లో రేయింబవళ్లు ఏరియేటర్లుతిప్పుతూ ఆక్సిజన్ టాబ్లెట్లు వేస్తూ ఆక్సిజన్ కొరత ఏర్పడకుండా చూస్తున్నారు. విద్యుత్ కోత విధిస్తే ప్రత్యామ్నాయంగా జనరేటర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. చేపల చెరువుల్లో సైతం ఆక్సిజన్ లోపించే అవకాశం ఉండడంతో చెరువుల్లో ఉదయాన్నే బోటు తిప్పుతుండడంతో కెరటాలు వచ్చి ఆక్సిజన్ ఉత్పన్నమవుతోంది. హడావిడిగా చేపలను పట్టుబడి చేసి సొమ్ము చేసుకుంటున్నారు. చేపలకు గిట్టుబాటు ధర లేకపోయినప్పటికీ అయినకాడికి అమ్ముకుంటున్నారు.


కలిదిండి మండలం మట్టగుంటలో హడావుడిగా చేపల పట్టుబడి

మినుము రైతుల ఆందోళన

రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండడం, మరోపక్క వాతావరణ శాఖ అధికారులు వర్షం పడుతుందని సూచించడంతో మినుము రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మినప తీతలు పూర్తికాగా నూర్పిళ్లు సాగిస్తున్నారు. ఈ దశలో వర్షం వస్తే తీవ్రంగా నష్టపోతామని రైతులు పేర్కొంటు న్నారు. గతేడాది ఇదే సమయంలో వర్షాలు కురిసి మినుము పంట పాడైంది. ఈ నేపథ్యంలో రైతులు ఎవరికి వారు హడావిడిగా కూలీలకు అదికరేటు వెచ్చించి నూర్పిళ్ల సాగిస్తున్నారు. మినుములు తడిస్తే వ్యాపారులు తక్కువ దరకు కొనుగోలు చేస్తారని, దీంతో తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మురుగు కాల్వ కాదు.. పంట కాలువే



ఇరగవరం, మార్చి 18 : సాగు నీటిని మళ్లించేందుకు ఏర్పాటు చేసిన పంట కాలువలు మురుగు బోదెలను తలపిస్తున్నాయి. తణుకు పట్టణ నడిబొడ్డులోని జంగం చెరువు ఎన్జీవో కాలనీ పాతూరు మీదుగా ప్రవహిస్తున్న ఉండ్రాజవరం పంట కాలువ ప్లాస్టిక్ వ్యర్థాలు మురుగుతో పేరుకుపోయి అధ్వాన్నంగా మారింది. ఈ కాలువ 11 కిలోమీటర్ల మేర సుమారు నాలుగు వేల ఆయకట్టుకు నీరు అందిస్తుంది. ఎంతటి ప్రాధాన్యత ఉన్న ఈ కాలువకు నిర్వహణ పనులు సక్రమంగా చేపట్టకపోవడం గ్రామాలు పట్టణాల్లోని మురుగును కాలువల్లోకి మళ్ళించడంతో నీరు కలుషితమై పంట దిగుబడిలో ప్రభావం చూపుతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.



విద్యా దీవెన సొమ్ములేవీ?



- జగన్.. బటన్ నొక్కితే సరిపోతుందా.. ఇప్పటికీ 20 శాతమే విడుదల
- చివరి ఏడాది విద్యార్థుల్లో అలజడి

జిల్లాలోని ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరం ప్రథమ క్వార్టర్ ఫీజు మొత్తాన్ని రూ.4.50 కోట్లు చెల్లించాలి. ఇటీవల సీఎం జగన్ బటన్ నొక్కడంతో తల్లుల ఖాతాలో ఫీజు జమ అవుతుందని అంతా ఆశించారు. కాని ఇప్పటి వరకు రూ.80 లక్షలు మాత్రమే తల్లుల ఖాతాలో జమ చేసింది. అంటే చెల్లించాల్సిన ఫీజులో కనీసం 20 శాతం కూడా లేదు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తల్లుల ఖాతాలో జమ అయిన వారం వ్యవధిలో కళాశాలకు ఫీజులు చెల్లించాలని ప్రభుత్వం షరతు పెట్టింది. సొమ్ములు మాత్రం జమ చేయలేదు. ఇప్పుడదే విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తోంది. నాలుగో ఏడాది విద్యార్థులకు త్వరలోనే పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఆలోగా ప్రభుత్వం నాలుగు క్వార్టర్ల ఫీజు ఇవ్వాలి. లేదంటే విద్యార్థులే ఫీజుల భారాన్ని భరించాలి. ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. అంతిమంగా విద్యార్థులను బలిచేస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో విడుదల చేయకుండా తాత్సారం చేస్తోంది. 2023-24 విద్యా సంవత్సరం ప్రథమ క్వార్టర్‌కు సంబంధించి జిల్లాలో విద్యా దీవెన నిమిత్తం రూ.25.60 కోట్లు మంజూరు చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఫీజు చెల్లిస్తామని చెప్పుకొచ్చిన ప్రభుత్వం ఇంకా మొదటి విడతలోనే ఉంది. అది పూర్తి చెల్లించలేదు. సరికదా ఇంకా మూడు క్వార్టర్‌లు బకాయి పడింది. డిగ్రీ, ఇంజనీరింగ్‌లో తృతీయ సంవత్సరంలోపు విద్యార్థులకు ఇబ్బంది లేదు. మరో ఏడాది సమయం ఉందంటూ కళాశాలలు వేచి చూస్తున్నాయి. అదే చివరి సంవత్సరం విద్యార్థులకైతే మెడపై కత్తి వేలాడదీస్తున్నాయి. పరీక్షల ముందు హాల్ టిక్కెట్‌లు ఇచ్చేది లేదంటూ యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి.

కోట్ల బకాయిల మాటేంటి ?

జిల్లాలో ఏప్రిల్ నాటికి చివరి సంవత్సరం పూర్తి చేసుకుంటున్న విద్యార్థులంతా ఏడాది మొత్తానికి దాదాపు రూ.20 కోట్లు చెల్లించాలి. ప్రభుత్వమే ఆ మొత్తాన్ని ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో తల్లుల ఖాతాలో జమ చేయాలి. ఈ ఏడాది ప్రభుత్వం ఫీజు మొత్తాన్ని చెల్లించకపోతే విద్యార్థులు బలి కానున్నారు. మొత్తం ఫీజు చెల్లిస్తేనే హాల్ టిక్కెట్‌లు ఇస్తామంటూ కొన్ని కళాశాలలు విద్యార్థులకు ముందస్తు సంకేతాలు పంపాయి. ఏప్రిల్‌లోగా ఫీజులు సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వం చివరి సంవత్సరం విద్యార్థులకు పూర్తిగా జమ చేయాలి. ఇటీవల బటన్ నొక్కినప్పుడు కేవలం ప్రథమ క్వార్టర్ మాత్రమే మంజూరుచేశారు. ఇదే ఇప్పుడు చివరి సంవత్సరం విద్యార్థులకు ఆందోళన కలిగిస్తోంది. కోట్ల రూపాయల ఫీజును ఎలా చెల్లిస్తామంటూ లబోదిబోమంటున్నారు. గతంలో ప్రభుత్వం కళాశాలల ఖాతాలోనే ఫీజులను జమచేసేది. విద్యార్థులకు ఇబ్బంది ఉండేది కాదు. చదువు పూర్తి చేసుకుని వెళ్లిపోయేవారు. ప్రభుత్వం తర్వాత బకాయిలు విడుదల చేసేది. తల్లుల ఖాతాలో ఎప్పుడైతే జమచేశారో విద్యార్థులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. ఫీజులు చెల్లించాలని విద్యార్థులను పట్టుబడుతున్నాయి.

బకాయిల ఊసేలేదు

ప్రభుత్వం పీజీ బకాయిల ఊసెత్తడం లేదు. పైగా పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ తొలగించింది. గతంలో బకాయిపడ్డ రూ.20 కోట్లను విడుదల చేయకుండా కళాశాలలకు మొండిచేయి చూపింది. మొత్తంపైన 75 శాతం ఇస్తామంటూ కళాశాలలను ఒప్పించింది. అది కూడా ఇప్పటి వరకు చెల్లించలేదు. దీంతో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులపై యాజమాన్యాలు కఠినంగా వ్యవహరిస్తున్నాయి. ఫీజుల విషయంలో రాజీ పడడం లేదు. మరోవైపు ప్రభుత్వం పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్(విద్యా దీవెన) అమలు చేయకపోవడంతో అంతిమంగా విద్యార్థులు నష్టపోయారు. ఉన్నత విద్యకు దూరమవుతున్నారు.

నిబద్ధతతో పని చేయండి : కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం, మార్చి 18 : భీమవరం కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. సోమవారం ఆయన కంట్రోల్ రూమ్‌ను సందర్శించి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ప్రజల నుంచి ఎలాంటి కాల్స్ వస్తున్నాయి, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో ఆరా తీశారు. కంట్రోల్ రూమ్ నెంబర్లు 08816-299616, 08816-299617కు మోడల్ కోడ్ ఉల్లంఘనపై అందిన ఫిర్యాదులను రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు, జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ కానాల సంగీత్ మాథుర్ తదితరులు పాల్గొన్నారు.


నేడు ప్రభుత్వ వైద్య శాఖ ఉద్యోగుల గ్రీవెన్స్‌డే

భీమవరం, మార్చి 18 : ప్రభుత్వ వైద్య ఉద్యోగుల సమ స్యలపై మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాల యంలో గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగే ఈ గ్రీవెన్స్‌లో ఉద్యోగులు తమ సమ స్యలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ ఫిర్యాదులను డైరెక్టర్ కార్యాలయానికి పంపించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

వలంటీర్లకు చెక్

యాప్‌లు క్లోజ్.. ఫోన్‌లు ఇచ్చేయాలంటూ ఆదేశాలు.. ఇప్పటికే కొందరు వాపస్

(భీమవరం-ఆంధ్రజ్యోతి)



ఎన్నికల సంఘం వలంటీర్లకు చెక్ పెట్టింది. ఇప్పటి వరకు ప్రభుత్వానికి, ప్రజలకు వారధులంటూ వైసీపీ పెద్దలు చెప్పు కొచ్చిన వలంటీర్లను ఎన్నికల విధుల్లో వినియోగించుకునే ప్రయత్నం చేశారు. సంక్షేమ పథకాలు అమలు తీరుపై లబ్ధి దారుల వివరాలు సేకరించారు. యాప్‌లో నమోదు చేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞత చూపాలంటూ చెప్పుకొచ్చారు. వలంటీర్లు తమ పార్టీ కార్యకర్తలంటూ సీఎం జగన్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత వారికి చెక్ పడింది. విధుల నుంచి దూరం పెట్టారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్‌లలోని యాప్‌లన్నింటిని క్లోజ్ చేసి వారి వద్ద డేటా లేకుండా జాగ్రత్తపడ్డారు. తాజాగా మొబైల్ ఫోన్‌లను తిరిగి ఇచ్చేయాలంటూ వారికి మెసేజ్‌లు వెళుతున్నాయి. వాస్తవానికి వలంటీర్లను ఎన్నికల విధుల్లో వినియోగించుకునేందుకు అధికార పార్టీ అన్ని ప్రయత్నాలు చేసింది. వైసీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లు ఇటీవల వలంటీర్లతో సమావే శాలు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల రకరకాల తాయిలాలు ఇస్తున్నారు. బట్టలు, భోజనాలు పెట్టి మరీ పంపిస్తున్నారు. వీరిని ప్రసన్నం చేసుకుంటే వారి ద్వారా ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను తమవైపు తిప్పుకోవచ్చనే ఆశతో అధికార పార్టీ నేతలున్నారు. ఈ క్రమంలో వీరికి చెక్ పెడుతూ ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో 9,200 మంది వలంటీర్లు ఉండగా, వీరంతా విధుల్లో పాల్గొనకుండా ఉత్త ర్వులు జారీ అయ్యాయి. కొన్నిచోట్ల వలంటీర్లను వినియోగించుకుంటూ ప్రచారపర్వానికి తెరలేపారు. ఎవరైనా ఈ విషయంలో ఫిర్యాదులు చేస్తే సదరు వలంటీర్లపై చర్యలు తప్పవంటూ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఆచంట మండలంలో వెనక్కు

ఆచంట, మార్చి 18 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలు కావడంతో ఇప్పటి వరకు వలంటీర్లకు ప్రభుత్వం అందజేసిన సెల్‌ఫోన్‌లు, సిమ్ కార్డులు, డివైజర్‌లను ఆయా గ్రామాల కార్యదర్శులకు తక్షణం అందజేయాలంటూ వారికి మెసేజ్‌లు వస్తున్నాయి. ఆచంట మండలంలో కొందరు వీటిని ఇప్పటికే అందజేశారు. మరికొందరు ఒకే సెల్‌ఫోన్ ఉండటం, అనేక గ్రూపులకు కనెక్ట్ అయి ఉండటంతో వారు లబోదిబోమంటున్నారు. కొన్నేళ్లుగా ప్రభుత్వ సెల్‌ఫోన్‌లు చేతిలో ఉండగా ఒక్కసారిగా అధికారులు వీటిని తిరిగి ఇచ్చేయాలని చెప్పడంతో మరికొందరు ఖంగుతిన్నారు.

మగవారికి ప్యాంటు.. షర్ట్, ఆడవారికి చీరలు

- వలంటీర్లకు ఎన్నికల గిఫ్ట్!

ఆకివీడు, మార్చి 18 : ఆకివీడు పట్టణ పరిధిలోని రెండు సచివాలయాలకు చెందిన 70 మంది వలంటీర్లకు వైసీపీ నేతలు సోమవారం దుస్తులు అందజేశారు. పురుషులకు ప్యాంటు, షర్ట్, మహిళలకు చీరలు అందజేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గెలిస్తేనే మళ్లీ మన జగన్ సీఎం అవుతాడు. కాబట్టి మీరంతా కష్టపడి పనిచేయాలంటూ హితబోధ చేశారు. లోపలకు వెళ్లే ముందు ఎవరూ ఫొటోలు తీయకుండా సెల్‌ఫోన్లు తీసుకుని తర్వాత ఇచ్చారు. దీనిపై ఓ వైసీపీ నేత వివరణ ఇస్తూ మా ఇంటిలో ఫంక్షన్ జరిగితే భోజనాలతో చీరలు పెట్టామని చెప్పుకొచ్చారు.

జనసేన ఎన్ని సీట్లు గెలుస్తుంది!

జిల్లాలో పందేలకు గేట్లు తెరచిన పందెగాళ్లు

నరసాపురం, మార్చి 18 : 'నిన్నటి వరకు టీడీపీ-జనసేన పార్టీలకు ఎన్ని స్థానాలు కేటాయిస్తారు. ఏ ఏ నియోజకవర్గాలు కేటాయిస్తారు. అసలు పొత్తు ఉంటుందా ? ఉండదా ? పవన్ కల్యాణ్ భీమవరంలో పోటీ చేస్తాడా ? చేయడా ?' అంటూ రకరకాల పందేలు జరిగాయి. తాజాగా ప్రధాన పార్టీల అభ్యర్థులను ప్రకటించడంతోపాటు ఎన్నికల షెడ్యూల్ కూడా విడుదల కావడంతో పందెం రాయుళ్లు కొత్త పందేలకు తెర తీశారు. ఎక్కువగా జనసేన పోటీ చేసే స్థానాలపైనే గురిపెడుతున్నారు. ఇప్పటికే నరసాపురంలో జనసేన టిక్కెట్ బొమ్మిడి నాయకర్‌కు దక్కుతుందని పందెం గెలిచి పందెంరాయుళ్లు జోష్‌లో ఉన్నారు. వీరిలో చాలామంది గెలిచిన మొత్తాన్ని జనసేన అభ్యర్థులపై పందెం పెట్టేందుకు సిద్ధం అవుతున్నారు. నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో జనసేన పోటీ చేస్తోంది. ఇందులో రెండు చోట్ల కచ్చితంగా ఈ పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తారని ఒక పందెం నడుస్తుంటే.. మూడు చోట్లా ఆ పార్టీదే గెలుపని రెండో పందెం జరుగుతోంది. సాధారణంగా కౌంటింగ్ తర్వాత పందేలు జరుగుతాయి. కాని, ఈ సారి నామినేషన్లు వేయకుండానే పందెగాళ్లు సిద్ధమవడం గమనార్హం. మరోవైపు ప్రజానాడీ తెలుసుకునేందుకు పందెం రాయుళ్లు గ్రామాల్లో తిరుగుతున్నారు. మరికొందరు సర్వేలు చేయిస్తున్నారు.

కార్పొరేషన్ స్థలంలో అక్రమ నిర్మాణం

వైసీపీ ప్రజా ప్రతినిధి మద్దతు!

ప్రశ్నించిన వారిపై ఆక్రమణదారుడి ఆగ్రహం


హెచ్చరిక బోర్డు ఉన్నా ఆగని నిర్మాణం

ఏలూరు రూరల్, మార్చి 18 : తంగెళ్ళమూడి కంద్రికగూడెంలో వైసీపీ ప్రజా ప్రతినిధి అండతో ఓ వ్యక్తి ఏలూరు కార్పొరేషన్ స్థలాన్ని ఆక్రమించి షాపు ఏర్పాటుకు పూనుకున్నాడు. ఇది కార్పొరేషన్‌కు చెందిన స్థలమని హెచ్చరిక బోర్డున్నా ఏ మాత్రం లెక్క చేయకుండా నిర్మాణం చేపట్టాడు. దీనితో స్థానికులు సోమవారం అడ్డుకునేందుకు ప్రయత్నించగా స్థలం ఆక్రమించుకున్న వ్యక్తి వారిపై గొడవకు దిగాడు. వివరాలివి.. కంద్రికగూడెం సెంటర్ సచివాలయం పక్కనే కిళ్లీ షాపును ఓ వ్యక్తి నడుపుకుంటున్నాడు. దాని పక్కనే కార్పొరేషన్‌కు చెందిన స్థలం ఉంది. ప్రస్తుతం ఉన్న షాపునకు జతగా మరో దుకాణం ఏర్పాటు చేసేందుకు ఐరన్ రాడ్‌లు, షెడ్డు రేకులతో రెండు రోజులుగా పనులు మొదలు పెట్టాడు. కార్పొరేషన్ స్థలంలో అక్రమ నిర్మాణం తగదని స్థానికులు వారించినా తనకు అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి అభయం ఇచ్చాడని, షాపు ఏర్పాటు చేసుకోమన్నారని చెబుతూ వారిపైనే తిరగబడడం విశేషం. సోమవారం ఉదయం స్థానికులు కొందరు కార్పొరేషన్ అధికారులకు ఈ విషయంపై ఫిర్యాదు చేశారు. వారు అక్కడకు చేరుకుని మునిసిపాలిటీ స్థలంలో అక్రమ నిర్మాణం తగదని వారించినా తనకు ప్రజాప్రతినిధి అండ ఉందని చెబుతూ అడ్డు వచ్చిన వారిపై దుర్భాషలకు దిగాడని స్థానికులు వాపోయారు. అయితే ఆ ప్రజాప్రతినిధి అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో అధికారులు షెడ్డు రేకులు మాత్రమే తొలగించి మిగతా వాటిని అలాగే వదిలి వేయడం కొసమెరుపు.



ద్వారకాతిరుమల గుడిసెంటర్‌లో కుక్కలను పట్టి వ్యాన్‌లో తరలిస్తున్న దృశ్యం

ద్వారకా తిరుమలలో వీధి కుక్కల పట్టివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ద్వారకాతిరుమల, మార్చి 18: 'ద్వారకా తిరుమలలో వీధికుక్కల భయం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలపై ఆలయ అధికారులు స్పందించారు. క్షేత్ర పరిసరాలలో తిరుగుతున్న వీధి కుక్కలను పట్టించి మూడు వ్యాన్‌లలో అటవీ ప్రాంతాలకు తరలించారు. రెండు రోజుల క్రితం అన్నదాన భవనం వద్ద ఓ భక్తు నిపై శునకం దాడి చేయడంతో అతని చేతివేలు సగం తెగిపడిన విషయం తెలిసిందే కొన్నాళ్లుగా ఈ శునకాలు డెర్మటైటిస్ అనే చర్మవ్యాధి బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. వీటి రోగాన్ని నిర్మూలించేందుకు ఎవరూ చర్యలు చేపట్టక పోవడంతో అది అంటువ్యాధిగా ప్రబలి ఆరోగ్యవంతమైన కుక్కలకు అంటుతున్నాయి.ఎట్టకేలకు అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆ ఏడుగురిని ఏం చేస్తారో ?

ఉమ్మడి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగుల క్రమబద్ధీకరణకు 'కోడ్' అడ్డంకి

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 18 : కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణ జీవోలకు ఎన్నికల కోడ్ అడ్డంకిగా నిలుస్తోందేమోనన్న భయాందోళనలు సంబంధిత ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఒకవేళ రెగ్యులరైజేషన్ జీవోలను జారీ చేయడానికి ఎన్నికల కమిషన్ నుంచి ప్రత్యేక అనుమతులను తెచ్చు కోవాల్సి వస్తే రాష్ట్రప్రభుత్వం తాత్సారం చేస్తుండటం ఉద్యోగుల ఉత్కంఠకు కారణమవు తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఎంపీహెచ్‌ఏ (మేల్, ఫిమేల్), ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఆప్తాల్మిక్ అసిస్టెంట్లు కేడర్లలో మొత్తం 268 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణకు అర్హులుగా గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ఈ ప్రతిపాదనలను ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టరేట్‌లో పరిశీలించి విడతలవారీగా ఆయా కేడర్ల ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు జీవోలు జారీచేశారు. ఇలా ఇప్పటివరకు మొత్తం ఆరు జీవోలు జారీచేయగా ఉమ్మడి జిల్లాలో 261 మందికి రెగ్యులరైజేషన్ పత్రాలను గత శనివారం మధ్యాహ్నం వరకు జారీచేశారు. మరో ఎంపీహెచ్‌ఏ (మేల్) ఐదుగురికి, ఒక ఫార్మసిస్టు, ఒక ల్యాబ్ టెక్నీషియన్ కలిపి మొత్తం ఏడుగురికి మాత్రమే క్రమబద్ధీకరణ జీవోలు జారీకావాల్సి ఉంది. రెగ్యులరైజేషన్‌కు ఆర్థికశాఖ ఆమోదం కూడా లభించి కేవలం జీవోల జారీ ప్రక్రియ వద్ద నిలిచిపోయిన ఇటువంటి వైద్య ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా ఇంకా 35 మంది మాత్రమే ఉన్నట్టు తెలిసింది. వీరికి జీవోలు జారీ అయితేనే గాని సర్వీసుల రెగ్యులరైజేషన్ జరుగదు. ఒకవేళ ఎన్నికల్లో ప్రభుత్వం మారిపోతే తదుపరి అధికారంలోకి వచ్చే పాలకులు పెండింగ్ రెగ్యుల రైజేషన్‌పై ఎటువంటి నిర్ణయం తీసుకుంటారోనన్న ఆందోళనలు వీరిలో నెలకొన్నాయి. ఎన్నికల కమిషన్ నుంచి ప్రభుత్వం ప్రత్యేక అనుమతులు తీసుకుని స్వల్ప సంఖ్యలోనే వున్న పెండింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణను పూర్తి చేయాలని అభ్యర్థిస్తున్నారు.

నేడు వైద్య ఉద్యోగుల 'స్పందన'

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 18 : జిల్లా వైద్యఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఉద్యోగుల జీతభత్యాలకు సంబంధించిన సమస్యలను తెలుసుకుని, పరిష్కార చర్యలు చేపట్టేందుకు ఈనెల 19న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేసే వైద్యఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

గిరిజన దర్బార్ రద్దు

బుట్టాయగూడెం, మార్చి 18 : కేఆర్ పురం ఐటీడీఏలో ప్రతి బుధవారం గిరిజన సమస్యలపై జరిగే గిరిజన దర్బార్‌ను రద్దు చేసినట్టు పీవో ఎం.సూర్యతేజ తెలిపారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున గిరిజన దర్బార్‌ను ఎన్నికల కోడ్ ముగిసేవరకు రద్దు చేసినట్టు పీవో తెలిపారు.



ఉండి కేవీకేలో వరిచేలను పరిశీలిస్తున్న బృందం

రైతులు భూసార పరీక్షలు చేయించాలి

ఉండి, మార్చి 17:రైతులు భూసార పరీక్షలను చేయించాలని తద్వారా పోషక లోపాలను నేల సమస్యలను అధిగమించవచ్చునని ఉండి కేవీకే ప్రోగ్రాం కోఆరినేటర్ ఎన్.మల్లికార్జునరావు అన్నారు. సోమవారం ఉండి మండలం ఎన్‌ఆర్‌పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన అవసరమని ప్రకృతి వ్యవసాయంతో సాగు ఖర్చును తగ్గించుకోవచ్చునని తెలిపారు. డైరక్టరు ఆఫ్ యానిమల్ హస్‌బెండరీ డాక్టర్ జవహర్ హుస్సేన్ మాట్లాడుతూ రైతులు దేశీయ ఆవులను పెంచాలన్నారు. డాక్టర్ వినయ లక్ష్మీ ప్రకృతి వ్యవసాయం, జీవామృతం కషాయం, బయోకల్చర్‌ల గురిం రైతులకు వివరించారు. డీఆర్‌సీ రామలింగేశ్వరరావు, నూకరాజు, ఏవో సంధ్య, డాక్టర్ డిబోరా మెషియానా, డాక్టర్ ఎశ్రీనివాసరావు, బి.రజిత, రైతులు పాల్గొన్నారు.

జగనన్న మాయ

పథకాలు ఇచ్చామంటూ ఇంటింటికీ వలంటీర్లు

ఒక్క రూపాయి ఇవ్వకపోయినా పత్రాల అందజేత

విస్తుపోతున్న కుటుంబాలు



భీమవరంలో టీడీపీ నాయకునికి అందించిన కరపత్రం

భీమవరం మార్చి 18 : "మీ చల్లని దీవెనలు.. దేవుడి ఆశీస్సులతో ఈ ఐదేళ్ల మీ బిడ్డ మీ ఊర్లోనూ మీ ఇంట్లో ఏమి మేలు చేశాడన్నది మీ కళ్ల ముందే కనిపిస్తోంది. ప్రతి గ్రామానికి, ప్రతి పేద కుటుంబానికి అండగా నిలబడగలిగాం. మీ బిడ్డ పాలనలో మీ ఇంట్లో మంచి జరిగి ఉంటే మీ బిడ్డను ఆశీర్వదించండి...మీ ముఖ్యమంత్రి.."అంటూ నవ రత్నాలు పథకంలో లబ్ధి పొందిన వారికి వలంటీర్ల ద్వారా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించి ప్రచారం చేస్తున్నారు. రూపాయి కూడా అందుకోని వారిని లబ్ధిదారులుగా చెబుతూ ఇంటింటికి వచ్చి పత్రాలు ఇవ్వడంతో విస్తుపోతున్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చినా వలంటీర్లు రహస్యంగా ఈ కార్యక్రమం చక్కబెడుతున్నారు. భీమవరం టూటౌన్‌లో ఒక ఇంటికి వెళ్లి మీకు మూడు పథకాల ద్వారా సొమ్ములు అందాయని చెప్పడంతో ఆయన విస్తుపోయారు. అసలు ప్రభుత్వ పథకాలకు తాను అనర్హుడినని చెప్పడంతో విస్తుపోవడం వలంటీరు వంతయింది. అలాగే వన్‌టౌన్‌లో ఒక తెలుగుదేశం పార్టీ నాయకుడిని నివాసానికి వెళ్లి అమ్మ ఒడి పథకం అందిందని, మీరు జగన్‌కు ఓటేయాలని కోరారు. ఇవన్నీ విన్న ఆయన తన తెల్ల కార్డు నాలు గేళ్ల కిందటే రద్దయిందని నాకు పథకం ఎలా వస్తుందని ప్రశ్నించారు..అలాగే వీరవాసరం మండలం పంజా వేమవరంలో కూడా ఇలాగే పథకాలు వచ్చినట్లు కరపత్రాలు పంచడంతో విస్తుపోతున్నారు.

ఆవును ఢీకొని యువకుడి దుర్మరణం

కైకలూరు, మార్చి 18: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్టు కైకలూరు టౌన్ పోలీసులు తెలిపారు. మండలంలోని ఆటపాక గ్రామానికి చెందిన కిలాడి రాజ్‌కుమార్ (24) ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై కైకలూరు వస్తుండగా తాలుకా సెంటర్లో ఆవును ఢీకొట్టాడు. దీంతో రాజ్‌కుమార్ తలకు తీవ్ర గాయాలవడంతో స్థానికులు కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కైకలూరు టౌన్ ఏఎస్‌ఐ పాండురంగారావు కేసు నమోదు చేశారు.

48 గంటలు దాటుతున్నా..

కోడ్ కూయలేదే !

దర్శనమిస్తున్న రాజకీయ ఫ్లెక్సీలు

పలుప్రాంతాల్లో ముసుగు పడని విగ్రహాలు





ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో..

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. ఎన్నికల నిబంధనలు అమలులోకి వచ్చి 48 గంటలు గడచినా నిబంధనల అమలులో అధికారులు నిర్లక్ష్యంగానే కనిపిస్తున్నారు.కొన్ని గ్రామాల్లో రాజకీయ ఫ్లెక్సీలు తొలగించలేదు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద పథకాల బోర్డులు దర్శనమిస్తున్నాయి. గోడలకు వేసిన పార్టీ రంగులు కనిపిస్తున్నాయి. ఫ్లెక్సీల తొలగింపులో వివక్షత ప్రదర్శిస్తున్నారని పలువురు రాజకీయ పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. కొన్ని చోట్ల విగ్రహాలకు సగం.. సగం ముసుగులు వేశారని చెబుతున్నారు.

ఏలూరు క్రైం : ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో అధికారులు ఇంకా మేలుకోలేదు. తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లపై వైఎస్‌ఆర్ పేరును తొలగించలేదని ఆంధ్రజ్యోతి దినపత్రికలో సోమవారం రావడంతో ఆఘమేఘాల మీద ఆ పేరును వాహనాలపై తొలగించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో అత్యవసర విభాగంలో ఉన్న లైటింగ్ డిస్‌ప్లేలో సీఎం చిత్రం కనిపిస్తూనే ఉంది. ఆసుపత్రిలోని వార్డులలో వాల్ పోస్టర్లు అలాగే ఉన్నాయి. ఐసీయూ విభాగంలో ప్రతి బెడ్ వద్ద డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ అనే పేరు రాసే ఉంది.కంటి విభాగానికి వెళ్ళే మార్గంలో లైటింగ్ డిస్‌ప్లే బోర్డు ఉంది అక్కడ కూడా ముఖ్యమంత్రి జగన్ చిత్రం యధావిధిగానే ఉంది. జనరిక్ మెడికల్ షాపుపై ఉన్న జగన్ ఫోటోను సాయంత్రానికి మూసి వేశారు. ఆసుపత్రి నుంచి మృత దేహాలను ఉచితంగా తీసుకువెళ్ళే వాహనంపై డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి చిత్రపటాలు అలానే ఉన్నాయి.

ఏలూరు టూటౌన్ : నిమ్మకాయల మార్కెట్ రోడ్డులో జగనన్న ఫ్లెక్సీలను అధికారులు ఇంత వరకు తొలగించలేదు. చిరంజీవి బస్టాండ్ కొన్ని సచివాలయాల్లో జగన్ ఫోటోలు తొలగించలేదు. పంపుల చెరువు వద్ద సచివాలయంలో జగనన్న పోటోలకు ముసుగులు వేయ్యలేదు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలకు ముసుగులు వెయ్యలేదు.

ఇక్కడేమో అత్యుత్సాహం..

పెంటపాడు : ఎన్నికల కోడ్ నేపద్యంలో విగ్రహాలకు ముసుగులు వేయడంలో కొందరు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. పెంటపాడు డీఆర్ గోయింకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వాతంత్ర్య సమర యోధుడు లాల్ బహుదూర్ శాస్త్రి విగ్రహానికి పంచాయతీ అధికారులు ముసుగు వేశారు. ఇదే కళాశాలలో అంతర్గత రహదారులకు, అదనపు తరగతి గదులకు ప్రజ ప్రతినిధులు శంకుస్థాపనలు చేసిన శిలా ఫలకాలు ఉన్నాయి.వాటిని మాత్రం వదిలేశారు.

జాతిపిత, అమరజీవుల విగ్రహాలకు ముసుగు



జంగారెడ్డిగూడెం టౌన్ : కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ నాయ కుల విగ్రహాలకు అధికా రులు ముసుగు వేస్తున్నారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో ఉన్న మహాత్మా గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలకు కూడా ఆసుపత్రి సిబ్బంది ముసుగు వేశారు. తర్వాత పొరపాటు తెలుసుకుని సిబ్బంది ముసుగు తొలగించారు.

వీరవాసరంలో దాత విగ్రహానికి...



వీరవాసరం : వీరవాసరం బస్టాండ్ సెంటర్‌లో ఉన్న దాత విగ్రహానికి ముసుగు తొడిగారు. విద్యాభివృద్ధి కోసం సర్వం దానం చేసిన విద్యాదాత మద్దాల రామ కృష్ణమ్మ , ప్రభుత్వ కార్యాలయాల సముదాయం , తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణమండపానికి ఎంతో విలువైన స్థలాన్ని దానం ఇచ్చిన మద్దాల శ్రీరంగనాయకులు విగ్రహాలను గ్రామస్థులు ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్‌తో ఈ దాతల విగ్రహాల పక్కన ఉన్న మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేయడంతో పాటు పక్కనే ఉన్న మద్దాల శ్రీరంగనాయకుల విగ్రహానికి ముసుగు తొడిగారు. ఇదేమిటంటే వీరవాసరం అభివృద్ధికి మూడు పర్యాయాలు సర్పంచ్‌గా వ్యవహరించిన శ్రీరంగ నాయకులు రాజకీయ నేతేనని చెబుతున్నారు.

పెదవేగి : లక్ష్మీపురంలో వైసీపీ స్థూపం మీద ఉన్న విగ్రహానికి ముసుగేసిన అధికారులు, అదే స్థూపంపై ఎగురుతున్న వైసీపీ జెండాను వదిలేశారు. లక్ష్మీపురంలోని గంగానమ్మ ఆలయం ఎదురుగా టీడీపీ, వైసీపీ, జనసేన ఫ్లెక్సీలు భారీగా కనిపిస్తున్నాయి. కొప్పులవారిగూడెంలో ఫ్లెక్సీలను తొల గిస్తుండగా 'ప్రతిపక్షం ఫ్లెక్సీలను మాత్రమే తొలగించండి. మా ఫ్లెక్సీల జోలికొస్తే ఊరుకోం' అంటూ అధికార పక్షం నాయకుడు ఒకరు బెదిరించారని గ్రామస్థాయి అధికారులు వాపోతున్నారు.

దెందులూరు : దెందులూరులో ప్రభుత్వ స్థలాల్లోని రాజకీయ బ్యానర్లు, జెండాలను అధికారులు తొలగించలేదు. దెందులూరు చెక్‌పోస్టు దగ్గర నుంచి కొవ్వలి అడ్డరోడ్డు దగ్గర వరకు వైసీపీ జెండాలు పెద్ద ఎత్తున ఉన్నా అధికారులు తొలగించే సాహసం చేయడం లేదు.

ద్వారకాతిరుమల :ద్వారకాతిరుమల సచివాలయానికి వేసిన వైసీపీ రంగు ఇంకా అలాగే ఉంది. తిమ్మాపురంలో ఓనేత ఇంటిపై, కొమ్మరలో మా నమ్మకం నువ్వే అంటూ వేసిన ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. తిరుమలం పాలెంలో ప్రదానరహదారుల పక్కన, ఎస్సీ కాలనీ, పలుప్రాంతాల్లో ఫ్లెక్సీల తొలగింపు పట్ల అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

ఆకివీడు : మెయిన్ సెంటర్, మాదివాడ ప్రాంతంలో ఫ్లెక్సీలు వేలాడు తున్నాయి. అధికారులు పూర్తిగా తొలగించామంటున్నారు. అధికారులు, సిబ్బంది అలసత్వం కొట్టొచ్చినట్లు కనబడుతుంది.



దెందులూరు జాతీయ రహదారిపై...



ఏలూరు రహదారిపై ...



తిమ్మాపురంలో ఓ వైసీపీ నాయకుని ఇంటిపై ..



ద్వారకాతిరుమల మండలం కొమ్మరలో..



పెదేవేగి మండలం లక్ష్మీపురంలో ఫ్లెక్సీలు



ఏలూరులో పూర్తిగా ముసుగు వేయని దృశ్యం

స్కూల్స్‌లో కోడ్ అమలు బాధ్యత హెచ్‌ఎంలదే

ఏలూరు ఎడ్యుకేషన్,మార్చి 18 :పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఆహార పదార్థాల ప్యాక్‌లపై ఎన్నికలకోడ్ (ఎంసీసీ) దృష్ట్యా సీఎం ఫొటోలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఎండీఎం డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కోడిగుడ్లపై ఎటువంటి స్టాంపులు ఉండరాదని ఆదేశించారు. ఇప్పటికే పాఠశాలల్లో వున్న చిక్కీల పాలథిన్ కవర్లను తొలగించిన తర్వాతే విద్యార్థులకు పంపిణీ చేయాల్సి ఉంటుంది. తొలగించిన పాలథిన్ కవర్లను ఒకచోటకు చేర్చి ధ్వంసం చేయాల్సి ఉంటుంది. వీటితో పాటే సీఎం ఫొటోలువున్న రైస్ బ్యాగ్‌లు, రాగి, బెల్లం పౌడర్ల కవర్లను డిస్పోజ్ చేయాలని సూచించారు. వీటిని అమలు చేయాల్సిన బాధ్యత అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు /ప్రిన్సిపాల్స్‌దేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులమలయ్యేలా డీఈవో, డీవైఈవో, ఎంఈవోలు బాధ్యత తీసుకోవాలని కోరారు.



తనిఖీల్లో 2.50 లక్షలు స్వాధీనం

భీమడోలు, మార్చి 18 : భీమడోలు రైల్వే గేటు సమీపంలో పోలీసు, రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న చెక్‌పోస్టు తనిఖీల్లో రెండున్నర లక్షల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. రావులపాలెం నుంచి ఏలూరు వెళ్తున్న కారులో రెండున్నర లక్షల రూపాయలు ఉండడాన్ని గమనించి అధికారులు ఆ సొమ్మును సీజ్ చేశారు. 50 వేల రూపాయలకు మించి సొమ్ము తరలిస్తే ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతులు ఉండాలని లేదంటే ఆ సొమ్మును సీజ్ చేస్తామని అధికారులు తెలిపారు.

భీమడోలు గ్రామ కార్యదర్శికి మెమో

ఎన్నికల కోడ్ నియమావళి నిబంధనలకు విరుద్ధంగా పనిచేసిన భీమడోలు గ్రామ కార్యదర్శి రాగూర్‌కు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఛార్జి మెమో అందజేశారు. భీమడోలు గ్రామంలో అధికార పార్టీకి చెందిన ఫెక్సీలను, వాల్‌పెయింట్స్‌ను తొలగించకుండా పక్షపాత వైఖరి అవలంభించారంటూ ఆంధ్రజ్యోతిలో సోమవారం వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. భీమడోలు మండల వ్యాప్తంగా ఉన్న ఫెక్సీలు తొలగించి విగ్రహాలకు ముసుగులు వేశారు.

ఐదుగురికి షోకాజ్ నోటీసులు

ఆచంట,మార్చి 18: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి. స్వామినాయుడు అన్నారు. పలు చోట్ల అధికారులు ఫ్లెక్సీలు, బేనర్‌లు తొలగించే కార్యక్రమంలో నిర్లక్ష్యం వహించినందున పోడూరు, నెగ్గిపూడి, కవిటం, నడిపూడి గ్రామాలకు సంబంధించి కార్యదర్శులకు, పోడూరు రైతు భరోసా కేంద్రం ఉద్యోగికి సంబంధించి షోకాజు నోటీసు జారి చేసినట్లు ఆర్‌వో తెలిపారు.

ఎన్నికల నియమావళి ఫిర్యాదులకు కంట్రోల్‌రూం : ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో చెన్నయ్య

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 18: ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు ఉంటే ప్రజలు స్వచ్ఛందంగా కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేయవచ్చని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కె.చెన్నయ్య పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని, మండలాల పరిధిలోని అన్ని బ్యానర్‌లను, తీయించామని, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశామన్నారు. కోడ్ నిబంధనల ఉల్లంఘన ఉంటే కంట్రోల్ రూం నంబర్ 08818-229699కు ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.ఈసారి ఎన్నికల కమి షన్ హోం ఓటింగ్ పద్ధతి ప్రవేశపెట్టిందని అందుకు 220 మందిని గుర్తించామన్నారు. ఒక్కసారి హోం ఓటింగ్‌కు రిజిస్టర్ అయితే పోలింగ్ స్టేషన్ వద్ద ఓటు వేసేందుకు అవకాశం ఉండదన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రింటింగ్ ప్రెస్ వారితో మీటింగ్ పెట్టి వారు ముద్రించే ప్రతీ కరపత్రం ఫోన్ నెంబర్, ప్రెస్ పేరుతో వేయా లని సూచించామన్నారు. కేబుల్ ఆపరేటర్లు ఎవరి యాడ్ వేసినా కలెక్టర్ కార్యాల యంలోని కంట్రోల్ రూం వద్ద పర్మిషన్ తీసుకున్న తరువాతే వేయాలన్నారు. ఏఆర్‌వో మురళికృష్ణ, ఎన్నికల డీటీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్



విచారిస్తున్న డీఎస్పీ సురేష్ కుమార్ రెడ్డి

పోలవరంలో పట్టపగలు చోరీ

రూ.20 వేల నగదు, 11 కాసుల బంగారం చోరీ

పోలవరం, మార్చి 18 : పోలవరంలో పట్టపగలు ఇంటి తాళాలు బద్దలు కొట్టి 20 వేల నగదు, 11 కాసుల బంగారం చోరీ చేసిన సంఘటన సోమవారం మధ్యాహ్నం జరిగింది. పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పోలవరం పంచాయతీ బీసీ కాలనీకి చెందిన పంతుల వెంకటేష్ దుబాయ్‌లో కొన్నాళ్ళు పనిచేసి వచ్చాడు. వెంకటేష్ భార్య లక్ష్మి సోమవారం కూలి పనికి వెళ్లి సాయంత్రం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు బీరువా తాళాలు బద్దలు కొట్టి బీరువాలో దాచిన 20 వేల నగదు, 11 కాసుల బంగారం చోరీకి గురైనట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. క్లూస్ సేకరించేందుకు ప్రత్యేక పోలీసు సిబ్బందిని, పోలీసు జాగిలాన్ని రప్పిస్తున్నట్లు డీఎస్పీ సురేష్ కుమార్ రెడ్డి , సీఐ మధుబాబు తెలిపారు.

యువకునికి ఏడాది జైలు శిక్ష

ఏలూరు క్రైం, మార్చి 18 : ప్రేమించి పెళ్ళి చేసుకుంటానని ఒక యువతిని మోసగించిన యువకుడిపై నేరం రుజువు కావడంతో ఏలూరులోని ఐదవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు కం మహిళా కోర్టు న్యాయాధికారి రాజేశ్వరి సోమవారం తీర్పు చెప్పారు. పాలకొల్లులోని ఉప్పల నరేష్ (19) ఒక యువతిని ప్రేమిస్తున్నానని చెప్పి పెళ్ళి చేసుకుంటానని మోసగించాడు. బాధితురాలు 2019లో పాలకొల్లు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసు ఏలూరులోని మహిళా కోర్టులో విచారణ సాగింది. నరేష్‌పై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష, రెండు వేల రూపాయల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామాంజనేయులు వాదించగా ప్రాసిక్యూషన్‌కు పాలకొల్లు టౌన్ సీఐ మంగాదేవి, కోర్టు కానిస్టేబుళ్ళు సహకరించారు.

గొడ్డలితో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

టి.నరసాపురం, మార్చి 18 : మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన పొలిమేర నాగరాజు అదే గ్రామానికి చెందిన అబ్బ దాసరి కాంతారావును పాత గొడవలను పురస్కరించుకొని గొడ్డలితో దాడి చేయడంతో తలమీద గాయమైంది. కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో టి.నరసాపురం ఎస్ఐ దుర్గా మహేశ్వరరావు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి చింతలపూడి కోర్టుకు రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

పేకాట స్థావరం కూల్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కుక్కునూరు మార్చి 18 :వేలేరులో ఏర్పాటు చేసిన పేకాట స్థావరాన్ని సోమవారం కూల్చివేశారు. ఆంధ్రా తెలంగాణ సరిహద్దుల్లో పేకాట జరుగుతున్నదనే విషయంపై సోమవారం ఆంధ్రజ్యోతిలో పేకాట జోరు అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. వేలేరు గ్రామం వెనుక భాగంలో ఒక తోటలో షెడ్ ఏర్పాటు చేసుకొని లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. తెలంగాణ, ఆంధ్రకి చెందిన జూదరులు ఇక్కడ జరిగే పేకాటలో పాల్గొంటున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో పూర్తిస్థాయిలో వచ్చిన వార్తకు పోలీసు యంత్రాంగం స్పందించింది. ఈ క్రమంలో షెడ్‌ని కూల్చివేయడంతో పాటు పోలీసులు తగిన నిఘా ఏర్పాటు చేసినట్లు సమాచారం.

బైక్ ఢీకొని చిన్నారికి తీవ్ర గాయాలు

స్పీడ్ బ్రేకర్లు వేయాలని దళిత నాయకుల డిమాండ్

పోలవరం, మార్చి 18 : రోడ్డు ప్రమాదంలో ఒక విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. పోలవరం పంచాయతీ కమ్మరగూడెం గ్రామానికి చెందిన ఐదేళ్ళ చిన్నారి మరపట్ల భవ్య ఆర్‌సీఎం పాఠశాలలో ఒకటో తరగతి చదువు తోంది. స్కూలు బస్సు ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా గూటాల గ్రామం నుంచి వస్తున్న బైకు వేగంగా ఢీకొని ఈడ్చుకుపోవడంతో కాలు విరిగి తీవ్ర గాయాలపాలైంది. ఆ పాపని రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని స్టేషన్ సిబ్బంది తెలిపారు. జిల్లా ఎస్సీ సెల్ నాయకులు గోకా రామకృష్ణ, హరికృష్ణ, కమ్మరగూడెం దళిత యువకులు మాట్లాడుతూ యడ్లగూడెం నుంచి కమ్మరగూడెం రెండో రోడ్డు వరకూ ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల వాహనాల వేగ నియంత్రణ లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ మార్గంలో ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీలు, చర్చిలు ఉండడం వల్ల విద్యార్థులు ఎక్కువగా సంచరిస్తారని ప్రమాదాల నివారణకు పోలీసులు, పంచాయతీ అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు వేయాలని డిమాండ్ చేశారు.

భార్య, భర్తల పరస్పర ఫిర్యాదు

భీమవరం క్రైం, మార్చి 18 : భార్యను కాపురానికి పంపించమని అడిగితే ఆమె తరుపు కుటుంబ సభ్యులు ఆరుగురు తనను కొట్టారని భీమవరం పట్టణంలోని భీమేశ్వరస్వామి కాలనీకి చెందిన బోగేశ్వరరావు ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. ఇదే ఘటనలో తన భర్త బోగేశ్వరరావు మద్యానికి బానిసై అధికకట్నం తీసుకురమ్మని వేధిస్తున్నాడని అతని భార్య నాగదుర్గ ఫిర్యాదు చేశారన్నారు. పరస్పర ఫిర్యాదులపై సీఐ శ్రీనివాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గోస్తనీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం

భీమవరం క్రైం, మార్చి 18 : భీమవరం విస్సాకోడేరు వంతెన సమీపంలోని గోస్తనీ వేల్పూరు పంటకాలువలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు వన్‌టౌన్ సీఐ శ్రీను చెప్పారు. గుర్రపుడెక్క, తూడులో కుళ్ళిపోయి ఉందన్నారు. జేసీబీ సహాయంతో తూడు తొలగించిన తరువాత మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొస్తామన్నారు.

యనమదుర్రులో దూకిన వ్యక్తి గల్లంతు

భీమవరం క్రైం, మార్చి 18 :భీమవరం పట్టణంలోని యనమదుర్రు కాలువ చిన్న వంతెనపై నుంచి ఓ వ్యక్తి ఆదివారం రాత్రి కాలువలోకి దూకినట్లు అతని బంధువులు సమాచారం ఇచ్చారని వన్‌టౌన్ సీఐ చెప్పారు. అగ్నిమాపక సిబ్బందితో సోమవారం గాలించగా ఆచూకీ లభించలేదన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

భీమవరం క్రైం, మార్చి 18 : భీమవరం వన్‌టౌన్‌లోని ఓ దుకాణం అరుగుపై సోమవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి కూర్చొని కిందకు ఒరిగిపోయి చనిపోయినట్లు సీఐ శ్రీను తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అతని వివరాలు సేకరించగా విజయవాడకు చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. మృతుడి బంధువులు భీమవరం వచ్చిన తరువాత మృతికి గల కారణాలు తెలుసుకుని కేసు నమోదు చేస్తామని తెలిపారు.

విద్యుత్ చౌర్యంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, మార్చి 18 : అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నారన్న సమాచారంతో ఏలూరు విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడి నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ట్రాన్స్‌కో విజిలెన్సు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. బుట్టాయిగూడెం మండలం కృష్ణాపురం గ్రామంలోని సయ్యద్ రబ్బానీ బాబా తన వెల్డింగ్ షాపునకు అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందడంతో విజిలెన్స్ సిబ్బంది తనిఖీలు చేశారు. అతనిపై కేసు నమోదు చేసి రూ.62,947 రూపాయలు అపరాధ రుసుం విధించారు. మరో ఏడు వేల రూపాయలు జరిమానాగా విధించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.



ఆగి ఉన్న కారులో మంటలు

నరసాపురం, మార్చి18 : పట్టణంలోని మాదవాయపాలెం రేవులో సోమవారం ఆగి ఉన్న డీజీల్ కారులో మంటలు చెలరేగాయి. పట్టణానికి చెందిన కానిస్టేబుల్ గోదావరి ఒడ్డున కారు ఆపి తిరిగి ఇంజన్ స్టార్ట్ చేయగానే కారు బ్యానెట్ నుంచి ఒక్కసారిగా మంటలు రేగాయి. దీనిని గుర్తించిన స్థానికులు వెంటనే బకెట్‌లతో నీరు తీసుకువచ్చి మంగలు ఆర్పివేశారు.

న్యాయం చేయాలంటూ మృతుల బంధువుల ఆందోళన



నరసాపురం, మార్చి 18: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మోహన్ (59) మృతి చెందాడు. ఆపరేషన్ చేసిన తరువాత వైద్యులు సరిగ్గా వైద్యం అందించ లేదంటూ ఆరోపిస్తూ బంధువులు పాలకొల్లు రోడ్‌పై బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో అర్ధ రాత్రి ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడింది. పరిస్థితి ఉద్రిక్తగా మారడంతో సీఐ స్వామి సిబ్బందితో ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. సోమవారం తెల్లవారుజాము వరకు ఇరువర్గాలతో చర్చలు జరిపి ఆందోళన విరమింపజేశారు. ఆస్పత్రి వైద్యులు మాత్రం రోగి ఆరోగ్య పరిస్థితిని శస్త్ర చికిత్సకు ముందే వివరించి, వారి అంగీకారంతోనే చికిత్స చేశామన్నారు.



ఆదర్శ లయన్స్ క్లబ్‌కు అవార్డులు

ఆకివీడు, మార్చి 18: అయి-భీ మవరం రోడ్‌లోని వి కన్వెన్షన్ హాల్‌లో జరిగిన లయన్స్ క్లబ్ రీజియన్ సమావేశంలో ఆదర్శ లయన్స్ క్లబ్ 12 అవార్డులు దక్కించుకుందని క్లబ్ అధ్యక్షుడు మోటుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక లయన్స్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ చార్టర్ అధ్యక్షుడు గొంట్లా కృష్ణమూర్తి, ప్రముఖులు వోలేటి శ్రీనివాసరావు, మోరా జ్యోతిరెడ్డి, మత్తి శ్రీర మేష్, ఐవీవీ సత్యనారాయణ, మోటుపల్లి సీతారామయ్య పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామి ప్రతిష్ఠ పూజలు

ఆకివీడు, మార్చి 18: వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నూతన దేవాలయంలో ఈ నెల 20న జరుగు విగ్రహ పునఃప్రతిష్ఠ పూజలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం యాగశాలలో విగ్రహమూర్తులకు వేద పండితులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం విగ్రహమూర్తులకు పాలభిషేకం చేశారు.

పేద విద్యార్థికి ఆర్థిక సహాయం

ఆకివీడు, మార్చి 18: బీటెక్ చదువుతున్న బి.నాగతేజకు సోమవారం లయన్స్ క్లబ్ తరపున రూ.10వేల ఆర్థిక సహాయం అందచేశారు. కార్యక్రమంలో ఆదర్శ లయన్స్ క్లబ్ చార్టర్ అధ్యక్షుడు గొంట్లా కృష్ణమూర్తి, క్లబ్ అధ్యక్షుడు మోటుపల్లి శ్రీనివాసరావు, ప్రముఖులు నేరెళ్ళ రామచెంచయ్య, పల్లి రంగారెడ్డి, ఎండీ అహ్మద్, వో లేటి శ్రీనివాసరావు, మోరా జ్యోతిరెడ్డి, మత్తి శ్రీరమేష్, ఐవీవీ సత్యనారాయణ, మోటుపల్లి సీతారామయ్య ఉన్నారు.

విమర్శలు, సవాళ్లు చేయడం సరికాదు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

నరసాపురం, మార్చి 18: పార్టీ నాయకులపై విమర్శలు, సవాళ్ళు చేయడం సరికాదని టీడీపీ మాజీ జడ్పీటీసీ గుబ్బల నాగరాజు, మాజీ వీసీ భూపతి నరేష్, జోగి పండు, సంది నర్సింహారావు హితవు పలికారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మూడు రోజుల క్రితం పార్టీలో ఉంటూ పార్టీ నాయకులపై చిటికెల రామ్మోహన్, నడిపూడి కృష్ణ, మరికొందరు చేసిన విమర్శల్ని ఖండించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని ఎవరు విడిచిపెట్టి వెళ్లారో... ప్రజలకు , పార్టీ అధిష్ఠానానికి తెలుసునన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలపడిందంటే దానికి రామరాజు నాయకత్వమే కారణమన్నారు. కార్యక్రమంలో కొప్పాడ రవి, అధికారి అనంత రామారావు, కొల్లు పెద్దిరాజు, వాతాడి ఉమా, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

నరసాపురం రూరల్, మార్చి 18: చామకూరిపాలెంకు చెందిన 100 మంది వైసీపీ నాయకులు జనసేనలో చేరారు. వీరికి ఇన్‌చార్జి బొమ్మిడి నాయకర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో తోట రాజేష్, కె చంద్రశేఖర్, లక్ష్మణ్, సురేష్, పండు, రాజు, రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

శివరాత్రి ఆదాయం రూ.3,55,891

నరసాపురం రూరల్, మార్చి 18: మండలంలోని లక్ష్మణేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భీమవరం టెంపుల్ ఇనిస్పెక్టర్ వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. భక్తులు వివిధ రూపాల్లో స్వామివారికి కానుకలు సమర్పించారు. దీన్ని ఆలయ ప్రాంగణం వద్ద హుండీని తెరిచి సిబ్బంది లెక్కించారు. కానుకల ద్వారా రూ.3,55,891లక్షల ఆదాయం వచ్చింది. ఈవో చాగంటి సురేష్‌నాయుడు, ఛైర్మన్ కంకటాల పెద్దిరాజు, రామాంజనేయులు పాల్గొన్నారు.

అక్షింతల కోసం బియ్యం సేకరణ

పెంటపాడు, మార్చి 18: జంగారెడ్డిగూడెంకు చెందిన శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి ప్రతినిధులు వెదుళ్ళ రామకృష్ణ దంపతులు భద్రాచలంలో నవమి రోజున కళ్యాణ అక్షింతలు నిమిత్తం సోమవారం మండలంలోని మౌంజీపాడు తదితర గ్రామాలలో భక్తుల నుంచి బియ్యాన్ని సేకరించారు. గ్రామానికి చెందిన ముమ్మారెడ్డి లక్ష్మీనర్సమ్మ, పాతూరి రాంప్రసాద్‌చౌదరి తదితరులు సహకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ళ, మార్చి 18 : విద్యుత్ మరమ్మతులు కారణంగా మంగళవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పెదఅమిరం గ్రామంతో పాటు ఇండస్ట్రీయల్స్‌కి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జిల్లా స్థాయి పద్య పఠన పోటీలు

తణుకు, మార్చి 18: తణుకు నన్నయ భట్టారక పీఠం ఆధ్వర్యంలో ఉగాదికి జిల్లా స్థాయి కృష్ణ శతకం పద్య పఠన పోటీలు నిర్వహిస్తున్నట్టు పీఠం ప్రధాన కార్యదర్శి కొల్లి రామచంద్రరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోపు 94907 45116కు వాట్సాప్ ద్వారా పంపాలన్నారు.

రాష్ట్ర స్థాయి పద్య కవితల పోటీకి ఆహ్వానం

తణుకు, మార్చి 18: ఉగాది సందర్భంగా 'అయోధ్య రాముడు' అనే అంశంపై పద్య కవితలను ఆహ్వానిస్తున్నట్టు నన్నయ భట్టారక పీఠం నిర్వాహకుడు సుశర్మ సోమవారం ఒక ప్రకటన తెలిపారు. ఇచ్చిన అంశంపై ఐదు పద్య కవితలు మాత్రమే రాసి పంపాలన్నారు. రాష్ట్రానికి చెందిన వార్లై, స్వీయ రచనకు వెనుక భాగమున పూర్తి చిరునామా రాసి, ఫోన్ నంబరు వేయాలన్నారు. పద్య కవితలను వాట్సాప్ ద్వారా 04907 45116కు పంపించాల న్నారు.

శ్మశాన భూమి పరిశీలన

ఉండి, మార్చి 18: శ్మశాన భూమిని ఆక్రమించుకున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం వాండ్రంలంకలోని శ్మశాన భూమిని ఆయన పరిశీలించారు. దళితులు, పోలీసు ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడారు. పుష్పరాజ్ మాట్లాడుతూ శ్మశానంనకు సంబంధించి సర్వేచేసి చుట్టూ ఫెన్సింగ్ వేసి అప్పగించాలని అధికారులకు సూచించారు. ఆక్రమణకు గురైన 77సెంట్లు శ్మశాన భూమిని అప్పగించాలన్నారు. భీమవరం డీఎస్పీ నారాయణస్వామిరెడ్డితో మాట్లాడారు.

ఆత్మసాక్షిగానే జనసేనలో చేరాం

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 18: ఆత్మసాక్షిగా తాము జనసేన పార్టీలో చేరామని మోదుగగుంట సర్పంచ్ కట్టా సత్యవతి, ఎంపీటీసీ దండుబోయిన విజయదుర్గ పేర్కొన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో మోదుగగుంట నాయకులు నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను మంత్రి కార్యాలయానికి పిలిపించి తాము జనసేనలో చేరలేదని బలవంతంగా చెప్పించారన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి : మార్నీడి

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 18: రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీ వల్లే సాధ్యమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మార్నీడి బాబ్జి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం పార్టీ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అవినీతిమయమని, సంపూర్ణ మద్య నిషేధం అమలు చేస్తానని మద్యం వ్యాపారం చేస్తున్నారన్నారు.

అన్నదానానికి బ్రేక్

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 18: తాడేపల్లిగూడెం పట్టణంలో ఇప్పటి వరకు 83 వారాలుగా అన్న క్యాంటీన్ వద్ద అన్నసమారాధనలు నిర్వహించామని, అయితే కోడ్ అమల్లోకి రావడంతో అన్న క్యాంటీన్‌ను నిర్వహించవద్దని ఆర్డీవో నోటీసులు ఇచ్చినట్టు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కోడ్ తొలగిన వెంటనే అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తామని తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

పెంటపాడు, మార్చి 18: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలంతా సహకరించాలని డీఎస్పీ మూర్తి కోరారు. సోమవారం మండలంలోని మీనవల్లూరు, రామచంద్రపురం గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు.

పంటలకు నీటి ఎద్దడి

దేవ, తామరాడల్లో నెర్రలు తీసిన పొలాలు

పెనుగొండ, మార్చి 18 : పొట్ట దశలో ఉన్న పంట పొలాలకు సాగునీరు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం తగదని కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు అన్నారు. పెనుగొండ మండలం బ్యాంక్ కెనాల్ నెంబర్ 1 కాలువ పరిధిలో దేవ, తామరాడ గ్రామాల్లో గత పది రోజులుగా వరి పొలాలకు సాగునీరు అందకపోడంతో నెర్రలు తీశాయన్నారు. పొట్ట, ఈనిక దశలో నీరు అందకపోతే పంట దిగుబడి తగ్గిపోయే పరిస్థితి ఉందన్నారు. కాలువ నిండా తూడు, డెక్కా గడ్డి తీవ్రంగా పెరిగిపోవడంతో సాగునీరు వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శివారు భూముల పరిశీలన

పాలకొల్లు, మార్చి 18: యలమంచిలి మండలం కాజ శివారు ప్రాంతాలలో సాగు నీటి సమస్య



కాజలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో అంబరీష్

పరిష్కరిస్తానని నరసాపురం ఆర్డీవో డాక్టర్ అచ్యుత అంబరీష్ అన్నారు. సోమవారం కాజ శివారు భూములకు సాగు నీరు అందని పంట పొలాలను ఆర్డీవో ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ వరకూ పూర్తిస్థాయిలో సాగు నీరందిస్తామన్నారు. అధైర్య పడవద్దని ఆర్డీవో అంబరీష్ రైతులకు సూచించారు. ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని రైతులతో అన్నారు. ఆర్‌డీవో వెంట నరసాపురం ఇరిగేషన్ డీఈ సీహెచ్ సత్యనారాయణ, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ పాల్గొన్నారు.



తామరాడలో నెర్రలు తీసిన చేలు

నీటిని పొదుపుగా వాడాలి

నరసాపురం రూరల్, మార్చి 18: ప్రస్తుతం నరసాపురం పంట కాల్వకు వంతులవారి విధానం నడుస్తోంది, ఎక్కడైన రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడితే తక్షణం అధికారులకు తెలియజేయాలని వ్యవసాయశాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి తెలిపారు. సోమవారం సీతారాంపురం నార్త్ గ్రామంలో పర్యటించారు. సాగునీటి సమస్యల్ని రైతుల్ని అడిగి తెలుసుకున్నారు. వంతుల నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. ప్రస్తుతం ఎక్కడ సాగు ఇక్కట్లు లేవన్నారు. ఎక్కడైన ఉంటే ఇరిగేషన్, వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు.







భీమవరంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి.. తణుకులో ఆరిమిల్లి సమక్షంలో టీడీపీలో చేరిక.. తాడేపల్లిగూడెంలో విలేకరులతో మాట్లాడుతున్న వలవల బాబ్జి

కూటమిని అధికారంలోకి తేవాలి: తోట

భీమవరం రూరల్, మార్చి 18 : భీమవరం మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు బీజేపీ, జనసేన పార్టీల నాయకులతో కలిసి పని చేస్తూ రానున్న ఎన్నికలలో ఎన్డీయే కూటమి అధికారంలోకి తీసుకురావడం కోసం కృషి చేయాలని జిల్లా టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రేవు వెంకన్న అధ్యక్షతన భీమవరంలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మి మాట్లాడుతూ మే 13వ తేదీన నిర్వహించనున్న ఎన్నికలలో ఉమ్మడి పార్టీలు బలపరిచిన భీమవరం నియోజకవర్గ జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులును అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ భీమవరం శాసనసభ్యునిగా పది సంవత్సరాలు భీమవరంలోని ప్రతీ గ్రామంలో 70 శాతం అభివృద్ధి చేశానని నాకు మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే నూరుశాతం పనులతో నియోజకవర్గాన్ని శరవేగంతో అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల జనసేన పార్టీ అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు), టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు, భీమవరం మండల టీడీపీ అధ్యక్ష,కార్యదర్శులు రేవు వెంకన్న, కౌరు పృథ్విశంకర్, జిల్లా టీడీపీ కార్యదర్శి నాగిడి తాతాజీ పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో విసిగిపోయిన యువత: ఆరిమిల్లి

తణుకు, మార్చి 18: వైసీపీ అరాచక ప్రభుత్వంలో ఉద్యోగ అవకాశాలు లేక యువత విసిగిపోయారని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం అత్తిలి మండలం గుమ్మంపాడుకు చెందిన మంతెన రామకృష్ణంరాజు (షిర్డిరాజు) ఆధ్వర్యంలో వైసీపీ నుంచి 400 మంది యువత బైక్‌లతో ర్యాలీగా ఆరిమిల్లి నివాసానికి వచ్చి టీడీపీలో చేరారు. యువతకు ఆరిమిల్లి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ నాయకులు బసవ రామకృష్ణ, కలగర వెంకట కృష్ణ, ఆనాల ఆదినారాయణ, నంబూరి శ్రీనివాసరాజు, దోమ రామకృష్ణ, మణికంఠ, ముదునూరి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

• వైసీపీ మంత్రులు అవినీతిలో కూరుకుపోయారని ప్రధాని మోదీ స్వయంగా చెప్పారంటే ప్రభుత్వ తీరు స్పష్టంగా అర్థమవుతోందని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాగళం భారీ బహిరంగ సభ విజయవంతమైందన్నారు. టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ త్రిమూర్తులుగా నిలిచి సభను నిర్వహించిన తీరు అద్భుతమన్నారు.



తాడేపల్లిగూడెంలో బొలిశెట్టి, తాతాజీలను సత్కరించిన దృశ్యం

వైసీపీ పాలనలో రాష్ట్రం నాశనం: వలవల

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 18: వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, ఆ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ప్రజాగళం సభకు లక్షల సంఖ్యలో జనం తరలి వచ్చి మద్దతు తెలిపారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆంధ్ర రాష్ట్రం నిర్ణయించుకుందన్నారు. గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, ముప్పిడి రమేష్, ముత్యాల సత్యనారాయణ, దూసనపూడి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నిమ్మల సతీమణి ప్రచారం

పాలకొల్లు రూరల్, మార్చి 18 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పాలకొల్లు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు తరపున భార్య సూర్యకుమారి అరట్లకట్ట గ్రామంలో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ ఉమ్మడి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవశ్యకతను ప్రజలు గుర్తించాలని అన్నారు. ఉమ్మడి కూటమి ఎన్నికల మేనిఫెస్టోలను వివరించారు. సూర్యకుమారి వెంట నాయకులు పొత్తూరి కుమార స్వామి రాజు, సీహెచ్ సత్యనారాయణ, చింతపల్లి శ్రీనివాస్, కూనపరాజు విజయ్ కుమార్, మాదాసు లలిత కుమారి, చింత పల్లి లక్ష్మీ కుమారి పాల్గొన్నారు.



అరట్లకట్టలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే నిమ్మల సతీమణి సూర్యకుమారి

కూటమిదే విజయం

ఆకివీడు రూరల్ మార్చి 18 : రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తుందని, ఉండి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి విజయం సాధిస్తాడని డీసీసీబీ మాజీ ఛైర్మన్, జనసేన నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు(రత్నం) అన్నారు. కుప్పనపూడిలో ఆయన మాట్లాడుతూ రాక్షస పాలన పట్ల ప్రజలు విసిగిపోయారని, జగన్ ప్రభుత్వానికి చరమగీతం పలికేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పట్ల ప్రజలలో స్పందన వస్తున్నదని అన్నారు.

తాతాజీని కలసిన బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 18: ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ కలసికట్టుగా ముందుకు వెళ్ళి నియోజకవర్గంలో అఖండ మెజారిటీ సాధిస్తాయని నియోజకవర్గ జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్, ఈతకోట తాతాజీలను బీజేపీ నాయకులు సత్కరించారు. నరిసే సోమేశ్వరరావు, దత్తు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

• పడమరవిప్పర్రులోని వడ్డిగూడేనికి చెందిన నాగసత్యనారాయణ, చెన్న రాంబాబు ఆధ్వర్యంలో పలువురు సోమవారం బొలిశెట్టి సమక్షంలో జనసేనలో చేరారు. బొలిశెట్టి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

జనసేన పార్టీని గెలిపించాలి

మొగల్తూరు: శేరేపాలెం పంచాయతీలో జనసేన అభ్యర్థి నాయకర్ సోమవారం జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో నవుదూరు గరువు వరకూ ర్యాలీ నిర్వహించి గ్రామస్థులతో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఉమ్మడి అభ్యర్థిగా వచ్చిన తనను ఆశీర్వదించాలని కోరారు.

నేడు భీమేశ్వర స్వామి కల్యాణం

ఆకివీడు, మార్చి 18: మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి దేవస్థానం వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం సాయంత్రం స్వామి కల్యాణం జరుగుతుందని మేనేజర్ సాగి రంగరాజు తెలిపారు.

టెన్త్ విద్యార్థులతో సరస్వతీ హోమం

భీమవరం టౌన్, మార్చి 18 : పదోతరగతి పరీక్షలు ప్రారంభం సందర్భంగా సోమవారంనాడు మెంటేవారితోటలోని బాలాత్రిపురసుందరీ అమ్మవారి ఆలయంలో ఆలయ అర్చకుడు కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో సరస్వతీ హోమం నిర్వహించారు. విద్యార్థులు హోమంలో పాల్గొన్నారు. పూర్ణాహుతితో కార్యక్రమాన్ని పూర్తి చేశారు. విద్యార్థులకు ఆశీర్వచనాలు అందించారు. అమ్మవారి వద్ద ఉంచి అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు.

మల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

ఇరగవరం, మార్చి 18 : వేండ్రవారిపాలెంలోని మల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. మంత్రి కారుమూరి ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి పూజలు చేశారు. మల్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెన్షనర్స్ సమస్యలపై వినతి

భీమవరం టౌన్, మార్చి 18 : ఫ్యామిలీ పెన్షనర్స్ పుట్టిన తేదీ నమోదు చేయడంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా రిటైర్డు ఉద్యోగుల సంఘం సభ్యులు కోరారు. భీమవరం సబ్ ట్రెజరీ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా భీమవరం వచ్చిన జిల్లా ఖజానా గణాంక అధికారి ఎ.గణేష్‌ను భీమవరం యూనిట్ కార్యదర్శి పి.సీతారామరాజు, జిల్లా రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గాతల జేమ్స్, కార్యదర్శి సాగిరాజు సత్యనారాయణ రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏవీ భాస్కరరావు, కార్యవర్గ సభ్యులు కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం సత్కరించారు. కొత్తగా మంజూరైన పీపీవోలో పాత జిల్లా కేంద్రమైన ఏలూరు డీటీవో కార్యాలయం నుంచి భీమవరం ట్రెజరీకి రావాల్సి ఉందని, ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్‌వచ్చే వరకు ఇదే విధంగా జరుగుతుందని తెలిపారు.

పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాలి

మొగల్తూరు, మార్చి 18: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాజకీయపార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీ బ్యానర్‌లు తక్షణమే తొలగించాలని ఎంపీడీవో బాబ్జిరాజు ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వీఆర్వోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎన్నికల నియమావళి ఉల్లఘన జరగకుండా చూడాలన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలు కనబడకుండా ముసుగు వేయించాలన్నారు. ఏ రాజకీయ పార్టీల నుంచి ఫిర్యాదులు రాకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలు

ఆకివీడు రూరల్ మార్చి 18: విద్యార్థులు సామాజిక సేవా దృక్పధాన్ని అలవర్చుకోవాలని వీవీగిరి కళాశాల ప్రిన్సిపాల్ సుజాత అన్నారు. వీవీగిరి ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 18 తేదీ నుంచి 24 వరకు దుంపగడపలోని బోసుకాలనీలో క్యాంపు కార్యక్రమంలో పాల్గొంటున్నారు. తమతోపాటు చుట్టూ ఉన్న ప్రజల జీవన విధానాలను అధ్యయనం చేసి వారికి అవసరమైన సాయమందిస్తూ, పారిశుధ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. వైస్ ప్రిన్సిపాల్ టి.ఓగేశ్వరరావు, ఆనంద్‌కుమార్, పి.శ్రీనివాసరావు, అనిల్‌డాయ్, యు.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయానికి విరాళం



ఆకివీడు రూరల్ మార్చి 18: కోళ్ళపర్రు గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి ఉండి నియోజకవర్గ తెలుగుయువత ఉపాధ్యక్షులు యర్రా రవి రూ 51వేల ఆర్థిక సాయమందించారు. సుమారు 100 సంవత్స రాల క్రితం నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 24వ తేదీన స్వామివారి ప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

ఆచంట, మార్చి 18: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ఆచంటలోని రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. కంట్రోల్ రూమ్ 24 గంటలు పని చేస్తుందని ఎలక్షన్‌కు సంబంధించి ప్రవర్తనా నియమావళికి సంబంధించి ఎటువంటి అంశాలు ఉన్న వెంటనే సంబంధిత టీమ్‌లను అక్కడకు పంపి సంబంధితులపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు. దీనికి సంబంధించి కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 08814-297299ను సంప్రదించాలని తెలిపారు.

ప్రజలకిచ్చిన హామీలు అమలు చేశాం

నరసాపురం, మార్చి 18: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు దాదాపుగా అమలు చేశామని చీఫ్ విప్ ప్రసాదరాజు చెప్పారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలకు నిధులు తెచ్చి ప్రారంభించిన ఘనత తమకే దక్కుతుందన్నారు. ఐదేళ్లలో రూ.5467కోట్ల సంక్షేమం, అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఆక్వా యూనివర్సిటీ, డిగ్రీ కాలేజీ, నాలుగు జూనియర్ కాలేజీలకు ఆమోదం తీసుకొచ్చి నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామన్నారు. రుస్తుంబాద ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేసిన ఘనత తమకే దక్కుతుందన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు



ఆకివీడులో పరీక్ష రాసేందుకు లోపలికి వెళుతున్న విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం

ఆకివీడు, మార్చి 18: పటిష్ట ఏర్పాట్లు మధ్య సోమవారం పదోవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నప్పటికీ హాల్ టిక్కెట్ల నెంబర్లు పరీక్షా కేంద్రాల్లో రూమ్‌లు పరిశీలించుకోవడంలో కొంత టెన్షన్ పడ్డారు. విద్యార్థులు ఫుల్‌హ్యాండ్స్ షర్టులు వేసుకురావద్దని, అట్టలపై రాతలు ఉన్న వాటిని రిజక్టు చేశారు. మండలంలో తొలిరోజు 55మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. స్క్వాడ్, ఎంఈవో ఏ.రవీంద్ర, ఎస్ఐ బి.నాగబాబు తదితరులు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

కాళ్ళ: కాళ్ళ హైస్కూల్లో 279కి గాను 16, కోపల్లెలో 227కిగాను 21, కలవపూడిలో 133 కిగాను 6, ఏలూరుపాడు జడ్పీ హైస్కూల్లో 192 మందికి గాను 16 మంది విద్యార్థులు చొప్పున మొత్తం 49 మంది గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.రవీంద్ర సోమవారం తెలిపారు.

పాలకోడేరు: గొల్లలకోడేరు హైస్కూల్లో 137 మందికి 127 మంది హాజరయ్యారు. పది మంది గైర్హాజరయ్యారు. పాలకోడేరు హైస్కూల్లో 176 మందికి గాను 155 మంది హాజరయ్యారు. 21 మంది గైర్హాజరయ్యారు. శృంగవృక్షం హైస్కూల్లో 170 మందికి 163 మంది హాజరయ్యారు. ఏడుగురు గైర్హాజరయ్యారు. విస్సాకోడేరు హైస్కూల్లో 79 మందికి 74 మంది హాజరయ్యారు. ఐదుగురు గైర్హాజరయ్యారు. మోగల్లు హైస్కూల్లో 140 మందికి 128 మంది హాజరయ్యారు. 12 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో పీవీఎస్ నాగరాజు తెలిపారు.

వీరవాసరం: వీరవాసరం మండలంలో ఐదు పరీక్షా కేంద్రాలలో 820 మంది హాజరు కావాల్సి ఉండగా 761 మంది హాజరయ్యారు. మత్స్యపురి జడ్పీహైస్కూల్ కేంద్రంలో 18 మంది, కొణితివాడ కేంద్రంలో 16 మంది, రాయకుదురు గ్రామంలో 13 మంది, వీరవాసరం జడ్పీహైస్కూల్‌లో 6, డివైన్ మెర్సీ హైస్కూల్‌లో ఆరుగురు విద్యార్థులు హాజరు కాలేదు.

ఆచంట: మొదటి రోజున తెలుగు పరీక్షకు సంబంధించి 614 మంది విద్యార్థులకు గాను 573 మంది పరీక్షలకు హాజరుకాగా 41 మంది గైర్హాజరైనట్లు ఎంఈవోలు ఎ. ఉషారాణి, రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలో ఆచంట, కొడమంచిలి, వల్లూరు, వేమవరంలలో పరీక్షలు జరిగాయి.

నరసాపురం రూరల్: పట్టణ, మండలంలో సోమవారం జరిగిన పదోవ తరగతి పరీక్షల్లో 115 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో పుష్పరాజ్యం తెలిపారు. తొలి రోజున పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగానే విద్యార్థులు వచ్చారు. తల్లిదండ్రులు సెంటర్ల వద్దకు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. హాల్‌టిక్కెట్లు పరిశీలించిన తరువాతే పోలీసులు కేంద్రాల లోనికి పంపించారు.

పోడూరు: మండలంలో పోడూరు, గమ్మలూరు, జిన్నూరు జడ్పీహైస్కూళ్లలో టెన్త్ క్లాస్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. మండల వ్యాప్తింగా మొదటి రోజు తెలుగు పరీక్షకు 574 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా వీరిలో 488 మంది హాజరయ్యారు. 86మంది గైర్హాజరయ్యారు.

పాలకొల్లు అర్బన్ / రూరల్: పాలకొల్లు పట్టణం రూరల్ మండలంలో 12 కేంద్రాలలో 10వ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొత్తంగా 1128 మంది బాలురు, 1009 మంది బాలికలు పరీక్షలకు హాజరు కావల్సి ఉండగా 186 మంది పరీక్షలకు హాజరు కాలేదని ఎంఈవో కార్యాలయ అధికారి తెలిపారు.

పెనుగొండ: మండలంలో ఏడు పరీక్షా కేంద్రాలలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు మండల విద్యాశాఖాధికారి డి.సుధాకర్ తెలిపారు. మొత్తం మండలంలో 1182 మంది విద్యార్థులు ఉండగా సోమవారం తెలుగు పరీక్షకు 1015 మంది పరీక్షలు రాశారని, 167 మంది గైర్హాజరు అయ్యారని తెలిపారు.

పోడూరు: మండలంలో పోడూరు, గమ్మలూరు, జిన్నూరు జడ్పీహైస్కూళ్లలో టెన్త్ క్లాస్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. 86మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

తణుకు: తొలిరోజు పదవ తరగతి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. తణుకు డివిజన్ పరిధిలోని 8 మండలాల పరిధిలోని 7 వేల 475 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 604 మంది గైర్హాజరయ్యారు.

ఆక్వా చెరువు పరిశీలన



కోమటిగుంటలో ఆక్వా చెరువుని పరిశీలిస్తున్న అధికారులు

కాళ్ళ, మార్చి 18 : ఆక్వా చెరువుల యాజమాన్యం నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎఫ్‌డీవో ఇందిరా ప్రియదర్శిని హెచ్చరించారు. కోలనపల్లి రెవెన్యూ పరిధిలోని సూర్యారావుపేట ప్రాంతంలో పంట కాలువ, పంట బోదెకు ఆనుకుని ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి చెరువు తవ్వారని కొంత మంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం రెవెన్యూ, మత్స్యశాఖ, ఇరిగేషన్ సిబ్బందితో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోలనపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 407-4ఏ, 3ఏ ఎకరం విస్తీర్ణం గల చెరువు నిబంధనలను అతిక్రమించి తవ్వినట్లు గుర్తించామన్నారు. రైతుకు నోటీసులు జారీ చేశామన్నారు.

ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

కాళ్ళ, మార్చి 18 : ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడంతో పాటు విభజన హామీలు నెరవేరుస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సోడదాసి గంగయ్య అన్నారు. కాళ్ళకూరు గ్రామంలోని ఆయన నివాసం వద్ద సోమవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్మాణం, రాష్ట్ర రాజధాని, విభజన హామీలు అమలు జరగాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏడు గ్యారెంటీ హామీలను ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఉండి ఇన్‌చార్జీ వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు, పీసీసీ సభ్యులు అంకెం సీతారాం, జిల్లా యూత్ అధ్యక్షులు సోము నాగ కేశవబాబు, జిల్లా కార్యదర్శి కొండా రాజేష్‌కుమార్, చింతా ఆదిశేషు, సోము అప్పలరాజు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

ఆచంట, మార్చి 18: కిమ్స్ ఆసుపత్రి సహకారంతో ఆచంటకు చెందిన వైట్ల కిషోర్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కమ్మ సంఘం సత్రంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

ఫ్లెక్సీలు, ఫొటోలు తొలగించాలని వినతి

ఆచంట, మార్చి 18: మండలంలో వైసీపీ ఫ్లెక్సీలు, లైటింగ్ బోర్డులు, రంగులతో ఉన్న బెంచీలు గ్రామ సచివాలయాల్లో, పంచాయతీ కార్యాలయాల్లో ఉన్న ఫొటోలను తక్షణం తొలగించాలని సోమవారం టీడీపీ తరుపున తహసీల్దార్ ఐపీశెట్టికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిర్రా బాలాజీ, గణేషుల సత్తిబాబు, కోట పెద్దిరాజు ఉన్నారు.

దళితులకు అండగా ఉండే పార్టీలకే మద్దతు

పోడూరు, మార్చి 18: భారత రాజ్యాంగం ప్రకారం దళితులకు కల్పించిన హక్కులను కాపాడుతూ దళితులకు కేటాయించిన నిధులు నూరుశాతం ఖర్చు పెడతామని ఏ పార్టీ అయితే మేనిఫెస్టోలో ప్రకటిస్తుందో ఆ పార్టీకే మలమహానాడు అండగా ఉంటుందని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ స్పష్టం చేశారు. పండితవిల్లూరు గ్రామంలో మాలమహానాడు మండల కార్యదర్శి సదమల్ల నరేష్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన మాలమహానాడు కార్యకర్తల సమావేశంలో నల్లి రాజేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఫ్యామిలీ డాక్టర్ పరిశీలన



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి మహేశ్వరరావు

గణపవరం, మార్చి 18: సీహెచ్ అగ్రహారంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి మహేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అధికారుల ఆదేశాలను ఎన్నికల కోడ్ నిబంధనలకు అనుగుణంగానే అమలు పరిచేలా వ్యవహరించాలని ఆదేశించారు. ఆరోగ్య శిబిరాల్లో కూడా కచ్చితంగా ఎన్నికల నియమాలు పాటించాలని స్పష్టం చేశారు. వైద్యాధికారులు ఎస్.సంతోష్ కుమార్‌రెడ్డి, సీసీ మహేందర్, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, వైద్య సిబ్బంది పాల్గొని వైద్య సేవలందించారు.